ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

- నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు
- జోన్–5లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ప్రారంభం
- తొలి రోజు విశేష స్పందన


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కె.కె.రాజు


ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి హాజరైన 48వ వార్డు ప్రజలు


రోగులకు కేస్ షీట్లు అందిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జోన్–5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ జోన్–5లో బుధవారం ప్రారంభమైన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ప్రజలు భారీగా తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 48వ వార్డు ఊర్వశి జంక్షన్ జాతీయ రహదారిలోని బాపూజీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో ఈ కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ అధికారులు, వైద్యాధికారుల సమక్షంలో ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు వైద్య శిబిరాన్ని ప్రారంభించి ఆరోగ్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. ప్రతి సంక్షేమ పథకం ప్రజల ముంగిటికే అందేలా గ్రామ/వార్డు సచివా లయ వ్యవస్థ ఏర్పాటు చేసి సత్ఫలితాలను సాధించిన ఈ ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇటువంటి వైద్య శిబిరాల ద్వారా ఒక్క పైసా ఖర్చు లేకుండా వైద్య పరీక్షలు, మందులు, ఉచిత కళ్లజోళ్లు పేదలకు ఇచ్చి ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తోందని చెప్పారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. వైద్య శిబిరంలో సేవలు పొందిన వార్డు ప్రజలు ఈ కార్యక్రమ నిర్వహణపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 48వ వార్డు ఇన్‌చార్జి నీలి రవి, సీనియర్ నాయకులు కర్రి రామారెడ్డి, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఏపీడీ పద్మావతి, వైద్యాధికారులు డాక్టర్ సి.హరిష్మా చంద్, డాక్టర్ సనపల రాజేంద్ర, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జి.వి.రమణి, జేసీఎస్ మండల కన్వీనర్ వి.అప్పారావు, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, డి.శ్రీనివాసరావు, డైరెక్టర్లు ప్రసాద్, రమేష్, పార్టీ నాయకులు గంగరాజు, పద్మా, శంకరరావు, చిరంజీవి, గోవింద్, కె.చిన్నా, గురువోజీ, జీవీఎంసీ, సచివాలయ, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరీక్షల వివరాలు

- బాపూజీనగర్ యూపీహెచ్‌సీకి సంబంధించి ఏఎన్‌ఎంలు, వలంటీర్లు సర్వేలు చేసి 1,960 మందికి టోకెన్లు జారీ చేశారు.
- 32 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.
- 658 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు.
- 48 మంది రోగులను కేజీహెచ్‌కు రిఫర్ చేశారు.
- 23 మంది రోగులను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

మెరుగైన వైద్యం అందిస్తామన్నారు



నా కొడుకు సంపత్‌కుమార్ పుట్టిన నాటి నుంచి అనారోగ్యం ఉండటంతో అనేక ఆస్పత్రులకు తిప్పేవాళ్లం. కళ్లు సరిగా కనిపించకపోవడం, మతిస్థిమితం లేకపోవడంతో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి తీసుకొచ్చాం. కంటి వైద్య పరీక్షలు చేసి అన్ని సదుపాయాలు ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. నా కొడుకు ఆరోగ్యం కుదుట పడితే జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– దుంగ కుమారి, సంపత్‌కుమార్ తల్లి, ఇందిరానగర్–2

జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి



76 ఏళ్ల వయసులో మోకాలి నొప్పులతో బాధపడుతున్న నన్ను.. కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు తిప్పే ఓపిక, ఆదాయం లేక అలానే వదిలేశారు. వలంటీర్ ద్వారా జగనన్న వైద్య శిబిరం బుధవారం ఉందని తెలుసుకుని వచ్చాను. ఇక్కడి వైద్యులు నా మోకాలు నొప్పులకు, కంటికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందించారు. కళ్లజోడు ఇస్తామన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్న జగన్ బాబే మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడు.

– పుట్టా పేరమ్మ, జైభారత్‌నగర్

వైద్య సేవలు బాగున్నాయి



జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి ముందుగానే సచివాలయ ఏఎన్‌ఎం, వలంటీర్లు నాకు బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. వైద్య శిబిరానికి టోకెన్ ఇవ్వడంతో దంత, గ్యాస్ పరీక్షలు ఉచితంగా చేయించుకున్నాను. దంత వైద్యశాలలో మరింత మెరుగైన పరీక్షలు చేయిస్తామని తెలిపారు. వైద్య శిబిరంలో సేవలు బాగున్నాయి.

– అమ్మాజీ, శ్రీనివాస్‌నగర్, బర్మాక్యాంప్

జోరుగా 'ఆరోగ్య సురక్ష' సర్వే


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జోరుగా సాగుతోంది. 292 సచివాలయం క్లస్టర్–9 పరిధిలోని రామాలయం వీధి పరిసర ప్రాంతాల్లో యూపీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సర్వేను బుధవారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల ఆరోగ్యాన్ని తనిఖీ చేస్తున్నారన్నారు.బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు నిర్వహించి తగు సూచనలిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శి శివకృష్ణ, కార్యదర్శులు, హెల్త్ సెక్రటరీలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, పార్టీ నాయకులు పైడి కృష్ణారావు మాస్టరు, పప్పల సునీత, సనపల నారాయణ స్వామి, ఏవీఎన్ రాజు, ఎం.లక్ష్మి, సోనీ, సీహెచ్ శ్రీను, కె.రఘు, పాతపట్నం రామ్మోహన్, సనపల రమేష్, నంబాల ఉదంతరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాలలో కొత్త మెస్ ప్రారంభం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన భోజన శాలను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త నారాయణరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. శివాజీపాలెంలో నిర్మించిన ఆరెంజ్ హాస్టల్‌కి అనుసంధానంగా దాదాపు రూ.40 లక్షల వ్యయంతో మెస్‌ను అభివృద్ధి చేశారు. ఒకే పర్యాయం 250 మంది విద్యార్థులు కూర్చుని భోజనం చేసేలా కేవలం 20 రోజుల వ్యవధిలో ఈ మెస్‌ను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

మత సామరస్యానికి విశాఖ ప్రతీక

సీతంపేట: మత సామరస్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, రెలిజియస్ ఫ్రీడం సంస్థల ప్రతినిధులు బుధవారం నగరంలో వివిధ మతాలకు చెందిన దేవాలయాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్య వి.బాలమోహన్‌దాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సమైక్యతకు విశాఖ ప్రతీకని, నగర ప్రజలు శాంతికాములని, ఇతరులకు ఆదర్శప్రాయులని కొనియాడారు. దీనిలో భాగంగా పోర్టు వెంకటేశ్వరస్వామి ఆలయం, అక్కడే ఉన్న చర్చి, దర్గా, గురుద్వారాలను సందర్శించి వారి ఆచారాలు, సంప్రదాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, రాజశేఖర్, నరసింహరావు, గౌరీ శంకర్, ప్రజ్ఞాన్‌కుమార్, మహ్మద్ హుస్సేన్, రాజేంద్ర జైన్, బెనర్జీ పాల్గొన్నారు.

రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు


రేషన్ షాపులో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్, సివిల్ సప్లై అధికారులు

సీతంపేట: విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ స్వరూపరాణి ఆదేశాల మేరకు సీఐ తిరుపతిరావు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది, పౌర సరఫరాల శాఖ అధికారులు కలిసి బుధవారం అక్కయ్యపాలెం శంకువానిపాలెంలోని 0387014 నంబర్ రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాకు పరిశీలించగా.. 570 కిలోల పీడీఎస్ బియ్యం అధికంగా ఉన్నట్టు గుర్తించారు. సీ–1955 చట్టం కింద సదరు రేషన్ షాపుపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఆర్ఐ మురళీ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మురళీనగర్ సెక్టార్ 6, 7, 8 ప్రాంతాల్లో జరుగుతున్న నూతన రోడ్డు నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పరిశీలించారు. రోడ్డు పనులపై అధికారులకు పలు సూచనలిచ్చారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, పార్టీ నాయకులు ఏవీఎస్ రాజు, సనపల నారాయణ స్వామి, లక్ష్మీనాయుడు, రాజు తదితరులు కార్పొరేటర్ వెంట ఉన్నారు.

రేషన్ పంపిణీ


రేషన్ బియ్యం అందిస్తున్న డీలర్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బుధవారం ప్రభుత్వ రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఇళ్ల వద్దకు రేషన్ వాహనం వచ్చి బియ్యం, పంచదార, కందిపప్పు అందజేశారు. రేషన్ కార్డుదారులు క్యూలో ఉండి సరకులు తీసుకున్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలను 89855 15989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


కరపత్రం అందిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారానికే పెద్దపీట వేశారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. జీవీఎంసీ 51వ వార్డులోని 289 సచివాలయం పరిధి కళింగనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ, సమస్యలను అడిగి తెలుసుకుని పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన సుపరిపాలన అందిస్తోందన్నారు. మునుపెన్నడూ లేని విధంగా వార్డులు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. మౌలిక వసతులను అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేలా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పైడి కృష్ణారావు మాస్టర్, వార్డు అధ్యక్షురాలు పి.సునీత, డైరెక్టర్లు పైడి శ్రీను, ప్రసూనారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మి, వార్డు సీనియర్ నాయకులు బి.తిరుమలరావు, పొన్నాడ అప్పారావు మాస్టరు, శ్యామ్, గణేష్, వరలక్ష్మి, రత్న, మోహనరావు, సాధు, చిన్ని, వినోద్, సీనియర్ నాయకులు భోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి, నేపాల్ శ్రీను, రాము, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఘనంగా యోగాచార్య శత జయంతి


విజేతలతో శ్రీనివాసానంద సరస్వతి, రిటైర్డ్ వీసీ ముత్యాలనాయుడు

సీతంపేట: శ్రీరామం ఇంటిగ్రల్ యోగా(శ్రీయోగా) ఆధ్వర్యంలో ద్వారకానగర్ బీవీకే కళాశాలలో యోగా గురువు, యోగాచార్య రాపర్తి రామారావు శత జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ విశ్రాంత వీసీ ఎం.ముత్యాలనాయుడు మాట్లాడుతూ యోగా గురువు రాపర్తి రామారావు ఆశయాల సాధనకు శిష్యులంతా కృషి చేయాలన్నారు. యోగాసనాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. ఆనందాశ్రమ పీఠాధిపతి శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ సనాతన ధర్మం అంటే ప్రకృతి సూత్రాలను అనుసరించడం, ఇతర మతాల్లా హిందువులు కూడా వారి సంప్రదాయాలను కొనసాగిస్తూ సమాజ సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం డిప్యూటీ ఈఈ వై.గోవిందరావు, ఏయూ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.వెంకటరావు, ఆర్.ఎస్.ఎన్.మూర్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ఈశ్వరి, కొవ్వాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించని వారిపై చర్యలు


ఆశీలమెట్ట వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీతమ్మధార: ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, క్రైం, రిజర్వ్ పోలీసులు బుధవారం సాయంత్రం ఆశీలమెట్టలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తనిఖీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై చర్యలు చేపట్టారు. హెల్మెట్ లేని వారు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించిన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించి, హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు రామ్మూర్తి, సంతోష్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాలకు కారణమయ్యే వారు, మద్యం తాగి వాహనాలను నడిపే వారు, ట్రాఫిక్ సమస్యలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో ఆర్ఐ వెంకటేష్, ద్వారకా క్రైం ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతో దొంగతనాలకు చెక్

- నేర నియంత్రణలో పోలీసులతో సహకరించండి
- ఈస్ట్ క్రైం సీఐ ఎర్రంనాయుడు


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: దొంగతనాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి వుండాలని ఈస్ట్ క్రైం సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సూచించారు. కాలనీ అసోసియేషన్లు, అపార్టుమెంట్ అసోసియేషన్లు, ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ప్రతి సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ వెంకటరామ గ్రంథాలయంలో స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన వస్తువులు ఇంట్లో కాకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలన్నారు. వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని వలన వాహనాలకు రక్షణ ఉంటుందన్నారు. తీర్థయాత్రలు, దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసులు ఉచితంగా అందించే లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగించుకోవాలని కోరారు. ఇల్లు వదిలి దూరప్రాంతాలకు వెళ్లినప్పుడు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు. దాని వల్ల పోలీసులు ఆ ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ సిస్టమ్ ఏర్పాటు చేస్తారన్నారు. తిరిగి వచ్చే వరకు పోలీసుల పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఇది పూర్తిగా ఉచితమన్నారు. దీనిని అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో టూటౌన్ క్రైం ఎస్ఐ కె.శ్రీను, హెడ్ కానిస్టేబుల్ హాఫీజ్, కానిస్టేబుల్ గణేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం


మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: కవి.. సమ సమాజ సభ్యత్వం స్వీకరించాలని సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అన్నారు. స్థానిక ప్రిజం కళాశాలలో బుధవారం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవి మనిషితనాన్ని నిరూపించాలన్నారు. డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి మాట్లాడుతూ సి.నారాయణరెడ్డి కవిత్వం గురించి వివరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ కవిత్వం అజరామరంగా భాసిల్లాలంటే కవులు మంచి కవిత్వం రాసే దిశగా కృషి చేయాలని సూచించారు. సంస్థ కార్యదర్శి చిన సూర్యనారాయణ లలిత గీతాల రచనల్లో మెళకువలను వివరించారు. కవి సమ్మేళనంలో డాక్టర్ మూర్తి, కర్మయోగి, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరి రమణ, రామతాత, రాంప్రసాద్, పీవీఆర్‌కే రావు, కె.రాఘవాచార్యులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


కె.వెంకన్న

సీతమ్మధార: బయటకు వెళ్లి వస్తానని చెప్పిన ఓ యువకుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకరమఠం రోడ్డు శివాలయం వెనుక రహదారిలో కోమటిపల్లి వెంకన్న కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. అక్కయ్యపాలెంలోని ఓ సెలూన్ షాపులో పనిచేస్తున్నాడు. గత నెల 18న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో యువకుడి కుటుంబ సభ్యులు స్నేహితులు, బంధువుల ఇళ్లకు వెళ్లినా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాగ్ అపహరించిన కేసులో దర్యాప్తు ముమ్మరం

సీతమ్మధార: పట్టపగలే పార్కింగ్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి లోపల బంగారం, నగదు ఉన్న బ్యాగ్‌ను దొంగలించిన కేసులో నాలుగో పట్టణ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దీనిపై సెక్యూరిటీ గార్డులను పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విజయవాడకు చెందిన జి.శ్రీనివాసరెడ్డి డైమండ్ పార్క్ వద్ద పార్కింగ్‌లో కారు నిలిపి టిఫిన్ కోసం వెళ్లి తిరిగి వచ్చేసరికి అగంతకులు కారు అద్దాలు పగులగొట్టి లోపల బ్యాగు చోరీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై బాధితుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జన సంచారం అధికంగా ఉండే డైమండ్ పార్కు వద్ద పట్టపగలు ఉదయం 11 గంటల సమయంలో చోరీ చేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై ఇప్పటికే సీసీ కెమెరాలను పరిశీలించారు. అలాగే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులను విచారిస్తున్నట్లు సమాచారం.

సంస్కృతీ సంప్రదాయాల అధ్యయనంతో దేశానికి మేలు


ఏవీఎన్ కళాశాలలో కశ్మీర్ యువత సందడి

అల్లిపురం: భారతదేశం సంస్కృతీ సంప్రదాయాలను యువత అధ్యయనం చేయడం ద్వారా దేశానికి మేలు జరుగుతుందని నెహ్రూ యువ కేంద్రం అధికారి జి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఏవీఎన్ కళాశాలలో బుధవారం సాయంత్రం యూత్ ఎక్స్చేంజ్ ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా జమ్మూ కశ్మీర్ నుంచి 120 మంది యువత విచ్చేసి ఏవీఎన్ కాలేజీని సందర్శించారు. కళాశాల చరిత్ర, ఇక్కడ చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న విషయాలు తెలుసుకుని సంతోషం వ్యక్తం చేశారు. యువజన అవార్డు గ్రహీత లీలా ప్రసాద్, శ్రీకాకుళం ఎన్‌వైకే అధికారి ఉజ్వల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు 13 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో టి.వి.ఎస్.రావు, ఉపాధ్యాయులు

సీతంపేట: ఈ ఏడాది నవంబరు 4 నుంచి 7 వరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరంలో జరగనున్న జాతీయ స్థాయి వేద గణిత విద్య, విజ్ఞాన్ మేళా పోటీలకు శ్రీకృష్ణ విద్యా మందిర్ విద్యార్థులు 13 మంది ఎంపికయ్యారని , కొంత మంది జోనల్ స్థాయికి అర్హత సాధించారని స్కూల్ వ్యవస్థాపకుడు టి.వి.ఎస్.రావు తెలిపారు. ద్వారకానగర్‌లోని పాఠశాలలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చూపిన ప్రతిభ ఆధారంగా తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వి.నర్మద, ఉపాధ్యాయులు సౌజన్య, అనూరాధ, ప్రసాద్, వైశాలి, చౌదరి, సోనేశ్వరి, దేవి, విద్య, పోటీలకు ఎంపికైన విద్యార్థులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


సిర్రా అరుణ్‌కుమార్ మృతదేహం

మర్రిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సిర్రా అరుణ్‌కుమార్(52) అనే వ్యక్తి మద్యానికి బానిసై ఈ ఏడాది జనవరిలో ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. అదే ప్రాంతంలో అక్కడా.. ఇక్కడా గడుపుతూ జీవిస్తున్నాడు. ఇప్పటి వరకు ఇంటికి మాత్రం వెళ్లలేదు. ఇతను పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. కుటుంబ సభ్యులు కైలాసపురం శాంతినగర్‌లో ఉంటారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో రైల్వే గ్రౌండ్స్‌లో చెట్టుకు ఉరివేసుకుని మృతిచెందడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సిర్రా రోహిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.